


# కాలమ్ దాటని కబుర్లు

బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### సృష్టిలో తియ్యనిది

**సృష్టిలో తియ్యనిది ఏవిటి?** అని అడిగితే 'అన్నీ తీసినవే' అన్నాడుట ఓ తిక్క మనిషి. నిజమే అసలు మనం తియ్యకుండా ఏం వదిలి పెడతాం చెప్పండి? పాలలోంచి వెన్న తీస్తాం. పూలలోంచి మకరందం తీస్తాం. బియ్యంలోంచి కూడా ఆల్కాహాల్ తీస్తాం. ఇక మనిషి కనిపిస్తే వాడి మనసు మధించి లోపల ఏం ఉందో బయటికి తీస్తాం. తీసాకా "వాడిలా అన్నాడూ. వీడిలా అన్నాడూ" అని ఏడుపూ, కోపం, ద్వేషం, యుద్ధం.

అసలు ఈ 'తియ్యని' అన్న మాటకి రెండు అర్థాలు. ఈ నిర్మాత ఉన్నాడు. పెద్ద హీరోలతో పెద్ద పెద్ద హిట్ సినిమాలు తీసిన స్టార్ నిర్మాత. ఆయనని ఓసారి ఓ ఫ్రెండ్‌కి పరిచయం చేస్తూ "ఈయన తియ్యని నిర్మాత" అన్నాను.

తనని స్వీట్ ప్రొడ్యూసర్ అంటున్నానని అనుకుని ఆయన మురిసిపోయాడు. కానీ నా ఉద్దేశం 'సినిమాలు తియ్యని నిర్మాత' అని. నా ప్రతి నవలా హక్కులూ ఆయన కొన్నాడు. ఒక్కటి కూడా సినిమాగా తియ్యలేదు. ఓ సినిమా తీసాడు. కానీ అది ఆయన కొన్న నవల కాదు.

చిన్నప్పుడు వాళ్ళ ఊళ్ళో పుస్తకాల షాపులో ఏ పుస్తకం వచ్చినా ఆయన కొనేవాడుట. అదే అలవాటుగా ఎవరే నవల రాసినా ఆయనకి నచ్చితే రైట్స్ కొంటాడు. కానీ తియ్యడు. సాలార్‌జంగ్ మ్యూజియంలో అందరూ చూసి ఆనందించే శిల్పాన్ని ఇంట్లో కొని పెట్టుకుని ఒక్కడే చూసే మనస్తత్వం కొందరికి ఉంటుంది. ఈయన రైట్స్ కొనకపోతే పాపం తీసే నిర్మాత ఎవడైనా కొనేవాడేమో కూడా.

ఇదో 'తియ్యని' అర్థం.

ఇంకొక తియ్యనిది నిజంగా మధురం. ఎంత అంటే మనకి సుగర్ వ్యాధి వచ్చేటంత, కొంతమంది ప్రేమకి నేను అలాగే బాధ పడుతుంటాను.

మా 'పట్టుదల' సినిమాకి మ్యూజిక్ డైరెక్టర్ శ్రీలేఖ. అస్తమానం నా చెవిలో తియ్యతియ్యని రాగాలు పాడేస్తూ ఉంటే 'ఒద్దమ్మా నా షుగర్‌ని బోర్డర్ దాటించకు' అంటుంటాను.

రమణిగారు మంచి కాంప్లిమెంట్ ఇచ్చారని మురిసిపోతుంటుంది. నిజంగానే 'తెలుసా మనసా' పాటలో వెనక హమ్మింగ్ వింటే తెలుస్తుంది ఎంత తీపో.

ఈ మధ్య మా పిన్ని నాలుగు రోజులు మా ఇంట్లో ఉంది. ఆవిడ ఉత్త అమాయకురాలు. అంటే లోకం తెలీనిది కాదు. అస్సలు ఏ విషయాలూ పెద్దగా తెలీవు. అంటే చదువుకోనిది కాదు. రాజమండ్రిలో కందుకూరి రాజ్యలక్ష్మి కళాశాలకి వైస్‌ప్రిన్సిపాల్‌గా చేసి

రిటైరయింది. సినిమా హీరోయిన్, పొలిటీషియన్ జయప్రద ఈవిడ స్టూడెంటే ఇంటర్ మీడియెట్‌లో. డిగ్రీలో కూడా అయ్యేదే ఆవిడ చదువు కొనసాగించి ఉంటే. మా పిన్ని పేరు చంద్రభాను నియ్యోగి.

మా పిన్ని పెద్ద వయసులో ఏదైనా వ్యాపకం ఉండాలని భజనలకి వెళ్ళడం మొదలెట్టింది. మనం భగవంతుడి దగ్గరకి వెళ్ళేది ఆయన్ని చూడటం కోసం, ఆయన స్మరణ చెయ్యడం కోసం ఆయన గురించి తెలుసుకోవడం కోసం అయితే అది భక్తి. కానీ నిజానికి చాలా చోట్ల.. (క్షమించాలి భక్తులు) నేను గమనించింది ఏవిటంటే, మనని (మన పట్టుచీరల్నో, డాబూ దర్జాన్నో) చూపించుకోవడం కోసం మన గురించి (మన ప్రతాపం, పదవులు, పరపతీ) చెప్పుకోవడం కోసమో వెళ్తుంటాం.

మా పిన్ని కూడా ఈ విషయమే నాతో బాధపడుతూ చెప్పింది.

ఉదాహరణగా మడి రామేశ్వరి గురించి మీకు చెప్తాను. ఈ మడి రామేశ్వరీ, భర్తా, ఇండియాలో ఒంటరిగా ఉంటారు. వీరి పిల్లలు ఫారెన్‌లో ఎక్కడో ఉంటారు.

మడి రామేశ్వరితో సంభాషణ ఇలా ఉంటుంది.

"రామేశ్వరిగారు నిన్న భజనకి రాలేదే?" అని మా పిన్ని అడిగితే,

"మా కుక్ లీవ్ పెట్టిందండీ నేనే వంట చెయ్యాల్సి వచ్చింది. ఐ డోంట్ లైక్ అవుట్ సైడ్ ఫుడ్ నాకు మడి కదా!"

ఈ రామేశ్వరిగారు కూర్చున్న కార్లో బ్యాక్ సీట్లో ఆవిడ పక్కన మా అమ్మ కూర్చుంటే ఆవిడ వెంటనే "వెయిట్!" అని ఓ న్యూస్ పేపర్ మడిచి ఈవిడకీ, ఆవిడకీ మధ్య అడ్డుగా పెట్టిందట. ఎందుకంటే ఆవిడకి మడి.

ఇంకోసారి ఆవిడ చైర్ పక్కనే ఉన్న చైర్లో కూర్చున్న ఆవిడతో "కొంచెం డిస్టెన్స్ మెయిన్ టెయిన్ చెయ్యండి. నాకు మడి" అందిట.

ఈవిడ్ని భజనలకి తీసుకెళ్ళడానికి ఎదురింటి ఆయనో, ఇంకో భజన సమాజపు సభ్యుడో కార్లో ఎక్కించు వెళ్ళాలి. వాళ్ళ ఆయన రాడు. పైగా రామేశ్వరి "మా ఆయన ఆదివారాలు పేకాటకి ఇబ్బంది. అందుకే మా ఇంట్లో ఆదివారాలకి బదులు శనివారం భజన పెట్టుకుందాం" అని మార్పించుకుందిట. (కలికాలం కూడా పతివ్రతలుంటారు మరి) ఇంతకీ ఈ భజనలకి వెళ్ళడానికి ఎదురింటి ఆయనకీ, మరో ఆయనకీ కుదరక పోతే, ఇంకో పెద్దాయనకి స్కూటర్ మాత్రమే ఉందిట. ఆయనతో వెళ్ళాల్సి వస్తుంది.

అలాంటప్పుడు రామేశ్వరి "ఇదిగోండి మూర్తిగారూ... స్పీడ్ బ్రేకర్లూ అవీ వచ్చినప్పుడు నెమ్మది. నాకు మీరు తగలడం, మీద పడటం నచ్చదు. నాకు మడి!" అంటుందిట.

ఆయనకి డెబ్బై పై బడ్డాయి. ఈవిడకి అరవై ఐదు. అలాంటప్పుడు హాయిగా ఆటోలో వెళ్ళచ్చు కదా! వెళ్ళదు.

ఇంక మాట్లాడ్డం సొగసు ఇలా ఉంటుందిట. వీళ్ళ కార్లోనే భజనకి వయిలిన్ వాయించే ఆయన కూడా ఎక్కాడుట. ఆయనతో రామేశ్వరి అనవసర సంభాషణ,

"పాపం.. మీకు వయిలిన్ మీద వచ్చే ఆదాయం సంసారానికి సరిపోతుందా? పిల్లల్ని ఎలా చదివిస్తారూ? ఆడపిల్ల కూడా ఉన్నట్లుంది, పాపం పెళ్ళి చెయ్యాలంటే బోలెడు డబ్బుకావాలిగా"

ఈ పై సంభాషణ ద్వారా ఈవిడ పొందింది ఏవిటి? ఆయన వెనక్కి తిరిగి "పోనీ మా పిల్లల్ని మీరు చదివిస్తారా? ఓ ఆడపిల్ల పెళ్ళికి ఖర్చులు మీరు పెట్టుకుంటారా?" అని అడిగితే?

గతుక్కుమంటుంది.

"మీ కెందుకండీ? నోర్మూసుకుని కూర్చుని మీ స్టాప్ రాగానే దిగిపోక" అని ఆయన అంటే ఈవిడ పరువేంకానూ?

కానీ ఆయన పొలైట్‌గా, "ఫర్వాలేదండీ, నాకు సంగీత పాఠాలు కూడా ఉన్నాయి. బాగానే వస్తుంది" అన్నాడుట.

"ఏవండీ కనకవల్లిగారూ, మీరు నైవేద్యం ఏం తెస్తారు లెండి. మీకు సర్వెంట్ మెయిడ్ కూడా లేదు. నాకు కుక్ ఉందిగా నేను మహా నైవేద్యం తెస్తాను. ఫోర్ బర్నర్స్ స్టౌ మీద, ఎంత సేపు వస్తుందీ? ఇ విల్ బ్రింగ్" అంటుంది.

ఇంక అమృత కలశాలు మాటకొస్తే ఈవిడ అమృత కలశాలు ఇస్తున్న రోజు ఊరంతా తెలియాలి. అమృత కలశం అంటే కొంచెం బియ్యం, పప్పు, ఉప్పు, మిరపకాయలు, చింతపండూ పొట్లాలు కట్టిన ప్యాకెట్. ఇది అనాధలకి అంతా ఇస్తున్నారు.

"నరసింహంగారూ! నేను అమృత కలశాలు ఇవాళ ఇద్దాం అనుకుంటున్నా... మీరు కారు తెస్తారా? నేను రెండు అమృతకలశాలు ఇవ్వాలి కదా. మీరు రాకపోతే శర్మగారిని అడుగుతాను.. స్కూటర్స్ మీద మగాళ్ళు తాకుతారు. ఐ డోంట్ లైక్."

ఈవిడ తెలుగు టీచర్‌గా రిటైరయినా, సగం ఇంగ్లీషే మాట్లాడుతుందిట. పైగా ఈవిడ మడి వలన సాటి మనిషెవరూ పక్కన కూర్చోకూడదు. నిలబడకూడదు. కానీ ఈవిడ ఇంకో మనిషి మీద ఆధారపడకుండా పూట గడపలేదు. (పైగా ఎవరు భజనలో ఆవిడతో పాడుతున్నా ఆపి "అలా కాదు ఇలా" అని మెడ తిప్పి గొంతు తిరగక) చెపుతుందట. ఈవిడ మడి మాట వినీ వినీ విసిగి పోయిన ఎదురింటాయన "ఈ రామేశ్వరిగారు మడితో మహానైవేద్యం, అని ఇంత చెప్తారు కానీ ఆ వంట చేసే కుక్ లంబాడీ మనిషండీ" అని నిజం చెప్పాడుట.

లంబాడీ అయితే మహానైవేద్యం చెయ్యకూడదని రూలేం లేదు. కానీ ఈవిడ 'మడి' పబ్లిసిటీ మాత్రం ఈ లెవల్లో చెయ్యకూడదు.

మనిషి సంఘజీవి. మనిషిలో మనిషి మాట్లాడకుండా కాసేపు కూడా ఉండలేము. కానీ మన ఇండియాలో ఇది మరీ ఎక్కువ.

బస్సెక్కుతామా, ఓ రెండు గంటల ప్రయాణంలో మన జీవిత చరిత్ర అంతా బయటికి తియ్యాలి అనుకుంటాడు ఒకాయన.

డాక్టర్ దగ్గరకి వెళ్తామా ఓ గంట వెయిటింగ్ పిరీడ్లో తన ఆటోబయోగ్రఫీ అంతా మన మెదడ్లో ఎక్కించాలి అనుకుంటుంది ఇంకో ఆవిడ.

ఈ స్టేజ్‌లో ఎక్కి ఫైవ్ మినిట్స్‌లో మరో స్టేజ్‌లో దిగిపోయే ఆవిడతో కూడా ఎన్నో మాటలు మాట్లాడేస్తారు కొందరు.

"ఒక్కరే వెళ్తున్నారా?"

"లేదు, వెనకాల మా ఆయన ఉన్నారు"

"మీ ఆయనకి ఇవాళ ఆఫీస్ లేదా?"

"ఉంది. నేను ఆస్పత్రికి తీసుకెళ్ళమంటే శలవు పెట్టారు."

"గవర్నమెంట్ ఆఫీసేమో "

"కాదు బ్యాంక్"

"ఏ బ్యాంక్?"

"కెనరా బ్యాంక్"

"ఏ బ్రాంచ్?"

"ఉప్పల్ బ్రాంచ్"

"మీ ఆయన పేరు?"

"వాసుదేవరావు"

"మీరెక్కడుంటారు?"

"మౌలాలీలో, వెంకటేశ్వర నగర్"

"కమాన్ దగ్గరా?"

"మీ ఇంట్లో ఇద్దరే ఉంటారా?"

"మా అత్తగారుంటారు. కానీ మంచంలోంచి లేవలేరు"

ఈ పై సంభాషణ ఉబుసుపోక అడిగినదైతే ఫర్లేదు కానీ, ఈ మాత్రం సమాచారంతో ఎన్నో సైబర్ నేరాలు జరిగిపోతుంటాయి.

"మేమూ అక్కడ దగ్గర్లోనే ఉంటాం. మీ సెల్ నెంబర్ చెప్పండి. ఓసారి మీ ఇంటికొస్తా" అనగానే అమాయకంగా ఆడవాళ్ళు చెప్పేస్తారు ఆ మర్నాడు వీళ్ళు లేనప్పుడు ఇల్లు లూటీ అయిపోతుంది.

నాకు చాలా ఫోన్లు వస్తాయి. ఓసారి "మీకెలా తెలుసు నా నెంబర్?" అని అడిగితే.

"మీ అమ్మగారూ నేనూ నిన్న ఉదయం ఒకే షేర్ ఆటోలో కొత్తపేట నుండి దిల్‌సుఖ్‌నగర్ వెళ్ళాం" అంది ఆవిడ.

ఇలా మాటలు పొడిగించడం వలన కొన్ని సార్లు ప్రమాదాలు వస్తాయి. కొన్ని సార్లు మాట్లాడకుండా మొహాలు తిప్పుకోవడం వల్ల ఉపద్రవాలు వస్తాయి. ఉదాహరణకి మా వీధిలోకి కొత్తగా పంకజం గారు ప్రొద్దుటే నవ్వుతూ చేతిలో మరువం, కనకాంబరం, మల్లెపూల దండతో వచ్చి మీ చేతిలో ఆ మాల పెట్టి, లేదా మీవారు అయితే "వదినగార్ని ఓ సారి పిలవండి" అని చొరవగా అని, మీరొచ్చాక "మేం ఈ వీధిలోకి కొత్తగా వచ్చాం. మా ఆయన సోమశేఖరం ఎయిర్‌టెల్‌లో పని చేస్తారు" అని పరిచయం చేసుకుని నాలుగు గాలి కబుర్లు (ఎయిర్ టెల్ కబుర్లు) చెప్పి ఓ కప్పు కాఫీ తాగి, మిమ్మల్ని వాళ్ళింటికి పిలిచి వెళ్ళిందనుకోండి. రేపు ఏ పాస్‌పోర్ట్ ఇన్‌స్పెక్టర్‌కో ఎవరైనా వచ్చి సోమశేఖరం, పంకజం గార్లు తెలుసా? అంటే మీరు ఠక్కున 'తెలుసు. బాగా తెలుసు' అంటారు. లేదా ఏ దూరపు బంధువైనా సికింద్రాబాద్ స్టేషన్‌లో రైలు దిగి ఇల్లు వెతుక్కుంటూ వచ్చి, మమ్మల్నీ, మా లాంటి వాళ్ళనీ పంకజం గారిల్లు ఏదీ? అని ఎంతడిగినా ఎవరు చెప్పగలరు? అతనికి శోష వచ్చి పడిపోతాడు.

అలాగే ఓ మనిషి గురించి మంచి మాటైతే మైక్‌లో చెప్పాలి. చెడు అయితే చెవిలో చెప్పాలట. "ఆ సదాశివరావుగారు మంచి మనిషి. బాగా హెల్పింగ్ నేచర్" అని నలుగురి మధ్యలో పెద్ద గొంతుతో అనచ్చు. "ఆ శివరావు మహా పిసినారి. నాలిక ఎండిపోతున్నా ఎవరికీ మంచినీళ్ళు ఇవ్వడు" అని గట్టిగా అంటే, ఆ శివరావు మీకు శత్రువు అనడమే కాక, చుట్టూ ఉన్న నలుగురూ, మీ నోట్లో పడతామే అని మీతో మాటలు తగ్గిస్తారు. ఎవరైనా ఆశించేది. ఓ తియ్యని మాట. విమర్శకాదు.

ఇంకా కొందరుంటారు. ఎవరైనా తెలిసినవాళ్ళు కనిపించగానే, "ఏవిటీ ఇంత లావైపోయావు?" అంటారు. అవతల ఆవిడ ఏవీ అనలేక నవ్వుతుంది. మనసులో 'నీ సొమ్మేమైనా తింటున్నానా? నీకెందుకు బాధ?' అనుకుంటుంది. "అయ్యో! పూర్తిగా బట్టతలైపోయింది పాపం" అని పలకరిస్తారు కొందరు.

నాకు తెలిసిన ఒకావిడ. తన ఇంటికి పేరంటానికి వచ్చిన ఆడవాళ్ళతో ఇలా మాట్లాడుతుంది.

"సరితా నీకీ రాళ్ళదుద్దులు ఎవరు చేయించారూ? నీ మొహానికి అస్సలు సూట్ అవలేదు. అబ్బే. గంగాళానికి అటూ ఇటూ ఉన్న రింగుల్లా ఉన్నాయి. ఛీసెయ్!"

"బుజ్జీ! ఈ బ్లౌజ్ ఏవిటీ? డిజైన్ పెట్టించావు పూసలాళ్ళలాగా ఉన్నావు. అస్సలు డీసెంట్‌గా లేదు. అసహ్యంగా ఉంది"

"అనసూయగారూ మీ ఇంట్లో డిన్నర్‌లో జున్ను వడ్డించారు. అస్సలు బాలేదు. ఈసారి నాకు చెప్పండి. విజయవాడలో తెలిసిన వాళ్ళ ఫ్యాక్టరీ ఉంది. అక్కడినుండి తెప్పిస్తాను"

ఇంతలో ఆవిడ భర్త గురించి ఎవరో "అంకుల్ ఇంట్లో ఉన్నారా?" అని అడిగారు.

"మీ అంకుల్ ఇంట్లో ఉన్నా రోడ్డు మీదున్నా ఒకటే. దండగ. రిటైరయిపోయారుగా.. అస్సలు సర్వీస్‌లో ఉన్నప్పుడు మాత్రం తెలివి తేటలున్నాయా ఏవైనానా? ఈయనతో బాటు డిపార్ట్‌మెంట్‌లో ఉన్న వాళ్ళంతా బోలెడు సంపాదించుకున్నారు. ఈ మాత్రం అయినా ఉన్నాం అంటే నా తెలివితేటలే!"

ఇంతలో ఎవరైనా ఖర్మకాలి ఆవిడ చీరని మెచ్చుకుంటే, "ఆ.. ఉప్పాడలో నాకు ప్రత్యేకంగా నేసి పంపిస్తారు. అసలు చీరకట్టాలంటే మా బేబీనే అని మా ఊళ్ళో అంతా అనుకునేవారు. నా కాలేజ్‌డేస్‌లో అయితే, నా చీరలు చూడడానికే జనాలు రోడ్డు మీద నిలబడి ఎదురు చూస్తుండేవాళ్ళు!"

ఇక్కడ నాకు గురువుగారు గరికపాటి నరసింహారావు గారి మాట గుర్తుకు వస్తోంది. **"నీ గురించి పొగుడుకోకు నిజమైనా నమ్మరు. నీ గురించి తక్కువ చేసుకోకు. అబద్ధం అయినా నమ్ముతారు"** అన్నారు.

"నేను ఆరో తరగతి నుండే కథలు రాసాను. ఎప్పుడూ క్లాస్‌లో ఫస్ట్ వచ్చేదాన్ని" అని నేను నా ద్వారా చెప్పుకుంటే పోతే, అందులో ఒకటో రెండో నిజాలున్నా ఎవరూ నమ్మరు. 'బడాయి కాకపోతే ఆరో తరగతిలోనే కథలు రాసిందట. ఎప్పుడూ ఫస్టే వస్తే ఏ కలెక్టరో అయ్యేదిగా. ఈ దస్తాలు దస్తాలు రాసుకోడం ఖర్మేం? నమ్మేవాళ్ళుంటే సరీ.. నీళ్ళు పండిస్తుంది' అని చెవులు కొరుక్కుంటారు.

అదే "నాకు వ్యాకరణం రాదు. కొన్ని తెలుగు పదాలకి అర్థాలు సరిగ్గా తెలీవు" అని నేను నిజాయితీగా చెపితే

"అసలు ఏం తెలీకుండా రాసేస్తోందిట. పెద్ద గొప్ప రాతలేం కావు. తనే చెప్పింది ఏమీ రాదని" అని ప్రచారం చేస్తారు.

అందుకే నిన్ను నువ్వు తగ్గించుకోకూడదు. నిన్ను నువ్వు పొగుడుకోకూడదు.

ఇంక మరో రకం మనుషులుంటారు. ఓసారి మా కాలనీలో నాకు తెలిసిన ఒకావిడ "మా ఇంటికి తణుకు నుండి మా ఆడబిడ్డ వచ్చింది. మీ కథలన్నీ చదివిందట. మిమ్మల్ని చూడాలని కలవరించిపోతోంది. ఇంట్లో ఉన్నారా?" అని ఫోన్ చేసింది.

"ఆదివారమేగా ఇంట్లో ఉన్నాను. ఓ గంట దాకా వంటకి తొందరలేదుగా రమ్మనండి" అన్నాను.

ఒకావిడ సన్నగా పుల్లలా ఉంది. మాకు తెలిసిన వాళ్ళ అమ్మాయి వచ్చి "మా వెంకటరత్నం అత్తయ్య" అని దింపి వెళ్ళిపోయింది.

నేను నవ్వి "రండి కూర్చోండి" అన్నాను.

ఆవిడ కూర్చుంది.

కాసేపు మౌనంగా ఉన్నాను. ఆవిడేం మాట్లాడలేదు. నేనే కలగచేసుకుని "తణుకులోనే ఉంటారా?" అని అడిగాను.

ఆవిడ తల నిలువుగా ఊపింది.

"మీ వారేం చెస్తారు?"

"పోయారు"

"అయ్యో పాపం సారీ" అన్నాను.

ఆవిడ అలాగే కాలిమీద కాలు వేసుకుని, చెక్కిట చెయ్యి పెట్టుకుని కూర్చుంది.

నేను "ఇప్పుడే వస్తా" అని వంటగదిలోకి వెళ్ళి కాఫీ కలిపాను.

మా వారొచ్చి "ఆవిడెవరూ?" అన్నారు.

"నా అభిమానట. తణుకు నుండి వచ్చింది" అని కాఫీ తీసుకొచ్చి ఇచ్చాను.

ఆవిడ మౌనంగా అందుకుని తాగింది.

"పుస్తకాలు బాగా చదువుతారా?" టాపిక్‌లోకి లాగాలని ప్రయత్నించాను.

"అన్నీ నచ్చవు" అంది.

"నావి అన్నీ చదివారా?" ఆశగా అడిగాను.

"కొన్ని" అంది.

ఆవిడ మాటలు పొదుపుగా మాట్లాడుతుందని అర్థమయింది.

కాసేపటికి చాకలొచ్చింది. నేను బట్టలు వెయ్యడానికి లోపలికి వెళ్ళాను. ఓ గంట గడిచింది.

పిల్లలు పైకొచ్చారు. ఆవిడ్ని చూసి "హలో" అన్నాడు ఒకడు. ఆవిడ ఉలకలేదూ, పలకలేదు.

నా దగ్గరకొచ్చి "ఎవరావిడ?" అడిగారు.

"నా అభిమానట" అన్నాను.

"వల్లకాడు. మాటా పలుకూ లేకుండా హాల్లో గొబ్బెమ్మలా కూర్చుంది పొద్దుటనుండీ" అన్నారు మా వారు.

నేను ఘాటుగా జవాబిద్దాం అనుకుంటుండగా, మా అమ్మ గొంతు పెద్దగా వినిపించింది.

"ఆ ఊళ్ళోనే ఉన్నారా? చాలాకాలం అయింది చూసి. పిల్లలు పెళ్ళిళ్ళు అయిపోయాయా? మీరేం మారలేదు. అచ్చు అలాగే ఉన్నారు. కాస్త అయినా ఒళ్ళు రాలేదు. కళ్ళజోడొకటే మార్పు. విస్సన్నగారూ వాళ్ళూ బావున్నారా? మీ అమ్మాయిని ఏ ఊరిచ్చారూ? మేనరికమేనా?"

ఈ అగంతకురాలు మా అమ్మకి తెలుసా? అని నేను ఆశ్చర్యపోయి, తేరుకుని, "అమ్మా.. ఓసారిలా రా" అని గదిలోకి పిలిచి "ఆవిడ నీకెలా తెలుసూ?" అడిగాను.

"నాకెలా తెలుసేవిటే? మనం సుధ పెళ్ళిలో చూడలేదు? మీ ఆడబిడ్డ తోడికోడలేగా?" అంది ధీమాగా.

"కాదు. ఈయన కొలీగ్ గారి బంధువుట. ఆవిడ వచ్చి చాలా సేపయింది. నోరు తెరిచి మాట్లాడలేదు మానసికంగా బావున్నట్లు లేదు" అన్నాను.

"ఆ మాట నీ అభిమానిని అన్నప్పుడే అర్థమయింది" అని మా వారు గొణిగారు.

"అయ్యో! మరి నేను అన్ని మాట్లాడినా ఆ, ఊ అనలేదే?" అంది మా అమ్మ.

"అసలు నువ్వు అన్ని మాట్లాడటమే తప్పు" అన్నాను చిరాగ్గా.

అలా వెంకటరత్నం మా భోజనాల వేళకి, వాళ్ళ బంధువుల అమ్మాయొచ్చి (దేవతలా) రమ్మని పిలిస్తే లేచి ఆ పిల్ల వెనకే వెళ్ళింది.

అసలు ఎందుకొచ్చినట్లూ, ఎందుకెళ్ళినట్లూ నాకు అర్థం కాలేదు.

ఓ రోజున మా ఆడబిడ్డ పోస్ట్‌కార్డ్ ఒకటి తెచ్చి 'నీకే అనుకుంట' అని నా ముందు పారేసి వెళ్ళింది.

అందులో ఒంకర టింకర అక్షరాలతో

"రమణిగారూ, మీరంటే నాకు చాలా ఇష్టం. మిమ్మల్ని చూసానని చెపితే మా ఊళ్ళో అంతా సంతోషించారు. మీరు మాట్లాడుతుంటే వినడానికి ఎంతో బావుంది. **వెంకటరత్నం వ్రాలు"** అని ఉంది.

ఆ ఉత్తరం చదివి ఆ రోజు ఆవిడ్ని విసుక్కున్నందుకు చాలా పశ్చాత్తాపపడ్డాను. కొంతమంది మాట్లాడలేరు. అది తప్పుకాదు. లోపం అలవాటు లేకపోవడం. కానీ వాళ్ళ మనస్సులో అనేక భావాలుంటాయి. కనీసం ఈవిడ ఈ ఉత్తరం ద్వారా అయినా వ్యక్తీకరించింది. అదే సంతోషం అనుకున్నా.

సృష్టిలో తియ్యనిది అంటే స్నేహం అనో అమ్మ అనో చెప్పకుండా ఈ అర్థం పర్థం లేని గోలేమిటి అనుకుంటున్నారా?

అర్థాలు తీస్తే, వెతికితే అన్నీ తియ్యగానే ఉంటాయి.

మా అమ్మకి నేను "డాక్టర్ నన్ను సలాడు తినమని చెప్పారు కీరా, క్యారెట్, ఆకు కూరలూ, బీట్రూట్" అన్నాను. అంతే!

మరునాడు నేను ఇంటి కొచ్చి చూసేసరికి ఫ్రిజ్‌డోర్ లాగితే జలజలా రాలిపోయేటన్ని పచ్చి కూరగాయలు. ప్రొద్దుటే, బ్రేక్ ఫాస్ట్‌లో, మధ్యాహ్నం లంచ్‌లో, సాయంత్రం కాఫీలో, ఆవిడ అవిరామంగా నాకు పచ్చికూరలు, ఆకు కూరలతో సలాడ్, మొలకెత్తిన సెనగలూ పెడుతూనే ఉంది. ఆ కన్న తల్లి ప్రేమకి కన్నీళ్ళొచ్చాయి.

'అమ్మా' అని పిలుద్దాం అంటే 'మే..మే' అన్న శబ్దం తప్ప ఏమీ రావడంలేదు. సృష్టిలో తియ్యనిది కన్నతల్లి ప్రేమ కాక మరొకటి అని ఎలా అంటానూ? ఆ అనంద భాష్పాలు తుడుచుకుంటూ, పచ్చికూరలు తింటూ అనుకున్నాను.

**'ఆకులు తిన్న మేకలు గుట్టలెక్క గలవు!**

**మేకలు తిన్న మనిషి మెట్టులు ఎక్కలేడు!'**

ఇలా ఆనందంగా అమ్మ పెట్టిన ఆకులూ అలమలూ తింటూ కాలం గడిపేస్తుండగా, ఎవరో 'కైలాస్ మానస సరోవరం ట్రిప్ కొస్తావా?' అని అడిగారు.

"సంవత్సరానికి ఓ పెద్ద ట్రిప్ వేస్తా.. అది తప్ప వేరేదానికి ఓపిక లేదు" అన్నా.

"ఎక్కడికీ?" అడిగారు.

"ఈ భూమ్మీద పుడితే చాలు ఉన్నవాళ్ళూ, లేనివాళ్ళూ, అని లేకుండా ఏడాదికోసారి సూర్యుడు చుట్టూ భూమి చేసే ఫ్రీ ట్రిప్ ఉంటుందిగా అది చాలు" అన్నా.

Click here to share your comments on this story.

